## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి విరాళం



ఈఓ రామక్రిష్ణకు నగదు అందిస్తున్న దాత

**పాణ్యం:** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళం అందించినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. వైఎస్సార్‌ జిల్లా, పెద్ద ముడియం మండలం భూతామాపురం గ్రామానికి చెందిన పట్నం లక్ష్మయ్య, కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.50 వేలు నగదు అందించారన్నారు. రానున్న ఆదివారం ఆ కుటుంబ సభ్యుల పేరుతో అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది ఉన్నారు.

### చెరువులకు జలకళ



పాణ్యం చెరువుకు చేరిన నీరు

**పాణ్యం:** మండలంలోని చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలో ఆరు చెరువులు ఉన్నాయి. ఈ చెరువులన్నీ ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ కింద ఉండటంతో వాటి ద్వారా కాల్వలకు నీరు వెళ్లే క్రమంలో చెరువులు నిండాయి. పాణ్యం, ఆలమూరు, భూపనపాడు కొండజుటూరు చెరువులకు భారీగా నీరు చేరింది. సుగాలిమెట్ట వద్ద ఉన్న కొచ్చెరువుకు నీరు లేకపోవడంతో వెలవెలబోతోంది. అలాగే కొలమాల రిజర్వాయర్‌లో సాధారణ స్థాయిలో నీరు ఉంది. చెరువులకు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన మేర వర్షాలు లేకపోయినప్పటికీ చెరువుకు నీరు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### పోలకల్‌లో ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**సి.బెళగల్:** మండల పరిధిలోని పోలకల్‌ గ్రామంలో ఆదివారం కర్నూలుకు చెందిన కిమ్స్‌ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయం – 3 ఆవరణలో కిమ్స్‌ డాక్టర్‌ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు గుండె సంబంధ పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులుఅందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మాదక్క, కిమ్స్‌ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### రూపాల సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద సీజీఎం రాకేష్‌ కుమార్‌ పటేల్‌ కుటుంబ సభ్యులు

**కర్నూలు(రూరల్‌):** నగర శివారులోని జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి స్టేట్‌ బ్యాంక్‌ సీజీఎం రాకేష్‌ కుమార్‌ పటేల్‌ కుటుంబ సభ్యులతో కలసి స్వామిని దర్శించుకున్నారు. వీరి వెంట కర్నూలు ఆర్‌ఎం శ్రీనివాస్‌ ఉన్నారు. పూజల అనంతరం ఆలయ ఈవో జమ్ములమ్మ వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### స్మార్ట్‌ మీటర్లను తొలగించాలి



మాట్లాడుతున్న గురుశేఖర్‌

**కర్నూలు(సెంట్రల్‌):** కూటమి ప్రభుత్వం రజకులకు ఇబ్బంది కలిగించేలా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్లను వెంటనే తొలగించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్‌, జిల్లా అధ్యక్షుడు ముక్కన్న పిలుపునిచ్చారు. ఆదివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రజకులపై దాడుల నివారణ కోసం వెంటనే అట్రాసిటీ తరహాలో ప్రత్యేక చట్టాన్ని తెస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అంతేకాక రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న రజక పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అదిగో.. ఇదిగో అంటూ ఏడాది గడిచినా ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో ధర్నాలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, జయమ్మ, రాముడు, ఈరన్న, సూరి పాల్గొన్నారు.

# సమస్యలకు కేరాఫ్‌ కల్లూరు

- పరిశ్రమలకు నీటి కరువు
- పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలతో దుర్వాసన
- మురుగు కాల్వలు లేక కంపు
- గుంతలు పడిన రోడ్లతో అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం.. వసతులు కల్పించని అధికారులు



మురుగు నీటిలో లోడుతో వెళ్తున్న ఐచర్‌ వాహనం



రోడ్డుపై పారుతున్న మురుగు

**కర్నూలు (న్యూటౌన్‌):** కర్నూలు జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా కల్లూరు ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌ 1975లో ప్రారంభమైంది. 50 ఏళ్ల నుంచి ఆశించిన మేర అభివృద్ధి లేకపోవడంతో ఎన్నో సమస్యలతో పరిశ్రమల యజమానులు తలపట్టుకుంటున్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌గా పేరున్నా.. ఎక్కడా చుక్క నీరు లేదు. యజమానులు ట్యాంకర్ల సాయంతో నీటిని పెద్ద సంపుల్లో నింపుకుని పరిశ్రమలను నడుపుతున్నారు. మరోవైపు డ్రైనేజీ సౌకర్యం లేక మురుగు నీరంతా రోడ్లపై నిలవడం, వ్యర్థాలన్నీ గుంతల్లో పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలకు నివాసంగా మారింది. పరిశ్రమల్లోని వ్యర్థాలు సైతం ఎక్కడబడితే అక్కడ పడేయడంతో కంపుకొడుతోంది. ఇండ్రస్టియల్‌ ఎస్టేట్‌లో సుమారు 4 వేల మంది కూలీలు పని చేస్తున్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనికోసం కాలినడకన, వాహనాలపై వస్తూ వెళ్తుంటారు. అయితే రోడ్డుపై పారుతున్న మురుగు నీటిలో ఎక్కడ పడతామోనని కూలీ పనికి వెళ్తున్న వారికి వెన్నులో వణుకు పుడుతోంది. మరోవైపు పరిశ్రమల నుంచి వచ్చే భారీ వాహనాలు సైతం మురుగునీటి గుంతలో పడిన సందర్భాలు లేకపోలేదు. పరిశ్రమల నుంచి ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వస్తున్నా.. కనీస వసతులు కల్పించకపోవడంతో యజమానులు నిత్యం అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక వైపు వసతులు లేక.. మరోవైపు పరిశ్రమల చుట్టూ కాంపౌండ్‌ వాల్‌ లేకపోవడంతో ఎవరు పడితే వారు, ఎప్పుడు పడితే అప్పుడు కలియతిరుగుతూ ఇష్టానుసారంగా మారింది. చీకటిపడితే చాలు మందుబాబులకు అడ్డాగా మారింది. కొందరు ఆటోల్లో వచ్చి పూటుగా మద్యం సేవించి వీరంగం సృష్టిస్తున్నారు. అయినా పరిశ్రమల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో పరిశ్రమల యజమానులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు.

**మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం**

కల్లూరు ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఆలోచన కూడా ప్రభుత్వం చేయకపోవడంతో స్థానిక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల ద్వారా జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. కల్లూరు ఎస్టేట్‌ కర్నూలు కార్పొరేషన్‌ పరిధిలో ఉన్నా తమకు సంబంధం లేన్నట్లు వ్యవహస్తున్నారు. ఏళ్ల తరబడి సమస్యలతో సతమతమవుతున్న కల్లూరు ఎస్టేట్‌ సమస్యలను స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్‌ అధికారులు స్పందించాలని పరిశ్రమల యజమానులు, కార్మికులు కోరుతున్నారు.

**ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం**



కల్లూరు ఇండస్టియల్‌ ఎస్టేట్‌లో శతకోటి సమస్యలతో తల్లడిల్లిపోతున్నాం. నీటి సౌకర్యం లేక ప్రతి రోజూ రెండు ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుని ప్లాస్టిక్‌ పరిశ్రమను నిర్వహిస్తున్నాను. కాల్వలు, వీధి దీపాలు లేవు. గతంలో వర్షాకాలంలో 20 టైర్ల లారీ లోడ్‌తో వచ్చి మురుగునీటి గుంతలో ఇరుక్కుపోయింది. ప్రభుత్వం స్పందించి కల్లూరు ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌లో పరిశ్రమలకు నీటి సౌకర్యం, మురుగు కాల్వలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రోత్సాహం కల్పిస్తే బాగుంటుంది.

– అలీ, స్టార్‌ ప్లాస్టిక్స్‌ నిర్వాహకులు, కల్లూరు ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌



పేరుకుపోయిన వ్యర్థాలు



వీధిలైట్లు లేని విద్యుత్‌ స్తంభాలు



పేరుకుపోయిన వ్యర్థాలు

## పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు అంజిబాబు

**ఓర్వకల్లు:** మండలంలో నెలకొల్పనున్న పరిశ్రమలలో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మండల మహాసభలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయు మండల అధ్యక్షుడు షాజహాన్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అంజిబాబుతో పాటు, ఆటో యూనియన్‌ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సీఐటీయు జిల్లా నాయకులు గోపాల్‌, శ్రీధర్‌, రేణుకమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పరిశ్రమలల్లో ఉద్యోగాలకు స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. మండలంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిందని, చదువు, అర్హతను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం స్కీం వర్కర్లను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు నిధులు విడుదల చేయాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛభారత్‌ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరుతూ తీర్మానం చేశారు. సీఐటీయు మండల అధ్యక్షుడు షాజహాన్‌, మండల కార్యదర్శి శ్రీధర్‌, ఉపాధ్యక్షుడు సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థల నటుడికి అవార్డు



శ్రీనివాసులుకు అవార్డు అందిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు అంజనప్ప

**ఓర్వకల్లు:** మండలంలోని శకునాల గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు మొర్రన్నగారి శ్రీనివాసులుకు 'అంజన అవార్డు' దక్కింది. ఆయన చిన్నతనం నుంచి కళల పట్ల ఉన్న ఆసక్తితో, పౌరాణిక నాటకాలలో దుర్యోధనుడిగాను, మాయల మరాఠి పాత్రతో మెప్పు పొందారు. ఇటీవల హిందూపురం జిల్లా, లేపాక్షిలో నిర్వహించిన పౌరాణిక పద్య పోటీల్లో పాల్గొన్నారు. తేనె తెలుగు చారిటబుల్‌ ట్రస్టు ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకాలకు నిర్వహించిన పద్య నాటక పోటీల్లో రాయభారం పౌరాణిక నాటకంలోని 'మయసభ' ఏకపాత్ర అభియనయంతో ఆహూతులను అలరింపజేశారు. అందుకుగాను ట్రస్టు అధ్యక్షుడు అంజనప్ప చేతుల మీదుగా శ్రీనివాసులుకు 'అంజన అవార్డు'ను ప్రదానం చేశారు. ట్రస్టు బృందం సభ్యులు అవార్డుతో పాటు, ప్రశంసా పత్రం, శాలువాలతో సత్కరించారు.

## నాటక రంగంపై దృష్టి సారించాలి

**కర్నూలు(అర్బన్‌):** ప్రస్తుతం సెల్‌ఫోన్‌, యూట్యూబ్‌, సినిమాలతో దారి తప్పుతున్న యువత నాటక రంగం వైపు దృష్టి మళ్లించాలని కర్నూలు ఏపీఎస్పీ కమాండెంట్‌ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళా క్షేత్రంలో షాద్‌నగర్‌కు చెందిన బాలికలు 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అనే నాటకాన్ని ప్రదర్శించారు. అలాగే బాపట్ల జిల్లా ద్రోణాదుల పరిషత్‌ ఆధ్వర్యంలో 'వర్క్‌ ఫ్రం హోం' అనే లఘు నాటికను ప్రదర్శించారు. ముందుగా నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో కార్యాక్రమాన్ని ప్రారంభించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జేఎన్‌ శేషయ్య, పి.దస్తగిరి, కార్యదర్శి మహమ్మద్‌ మియ్యా, వ్యాఖ్యాత యాగంటీశ్వరప్ప, ఇనాయతుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెన్సార్‌ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య, దర్శకులు బీ.మహేంద్ర, సినీ నటి లహరి, బీటీ లక్ష్మన్నను ఘనంగా సన్మానించారు.

### అబ్దుల్‌ కలాంకు నివాళి

**ఓర్వకల్లు:** మండలంలోని నన్నూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కౌసల్య ఆధ్వర్యంలో ముందుగా పిల్లలకు 'నీతి కథలు' చెప్పి, పుస్తకపఠనం వంటి కార్యకలాపాలు చేయించారు. అనంతరం అబ్దుల్‌ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి ఆయన చేసిన సేవలను పిల్లలకు తెలియజేశారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**కర్నూలు(సెంట్రల్‌):** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్‌, మునిసిపల్‌ కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన వివరించారు. అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 ఫోన్‌ నంబర్‌ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చిన వారు దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్‌ సెంటర్‌ నంబర్‌ 1100కు ఫోన్‌ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్‌ సూచించారు. అలాగే ఝ్బుజౌట్బఝు.్ఛ ఇజౌఠి.జీ ఽ అనే వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

**నగర పాలక సంస్థలో**

**కర్నూలు (టౌన్‌):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్‌ పి.విశ్వనాథ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు



డ్రైనేజీని కప్పేసిన పిచ్చిమొక్కలు



పూడిక, పిచ్చి మొక్కలతో నిండిన డ్రైనేజీ

**కల్లూరు:** కల్లూరు అర్బన్‌ ప్రాంతాల్లో పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా తయారైందని, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్‌లో 16 వార్డులు ఉన్నాయి. వాటిలో సుమారుగా 2.5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. కర్నూలు మున్సిపాలిటీకి కల్లూరు అర్బన్‌ వార్డుల ప్రజలు వివిధ రూపాల్లో పన్నులు చెల్లిస్తున్నారు. అయినా వసతులు కల్పించడంపై ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీలో డ్రైనేజీలు పూడికతో నిండి ఉండగా, మరికొన్ని కాలనీల్లో సరిగా లేకపోవడం, కొన్ని కాలనీలో డ్రైనేజీ కాలువలపై పిచ్చి మొక్కలు పెరగడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. దీంతో దోమలు, లార్వాలు, ఈగలు వృద్ధి చెంది సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

## శుభకార్యం



నూతన వధూవరులతో కుడా మాజీ చైర్మన్‌ కోట్ల హర్ష, డాక్టర్‌ ఆదిమూలపు సతీష్‌ తదితరులు

**కోడుమూరు రూరల్‌:** వైఎస్సార్‌సీపీ నేత మల్లారెడ్డి కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వివాహ వేడుక ఆదివారం కోడుమూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి కుడా మాజీ చైర్మన్‌ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ డా.ఆదిమూలపు సతీష్‌, ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ సునీత, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, భారతి సిమెంట్‌ జిల్లా డిస్ట్రిబ్యూటర్‌ ఎద్దుల మహేశ్వరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరై వధూవరుడిని ఆశీర్వదించారు.

## విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం

**పాణ్యం:** గిరిజన గురుకుల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం ఫుడ్‌పాయిజన్‌కు గురైన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్‌, మినరల్‌ వాటర్‌ తదతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం బీసీ రెసిడెన్సియల్‌ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. నెరవాడ, ఆలమూరు, కొణిదేడు గ్రామాల్లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్‌ క్రిష్ణానాయక్‌, ఎంఈఓ సుబ్రమణ్యం నాయకులు ఉన్నారు.

# వ్యాధుల కాలం.. పశువులు భద్రం!

- వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి
- ఏమాత్రం అలసత్వం వహించినా వ్యాధుల ముప్పు
- ముందుస్తు టీకాలతో రోగాలు దూరమని పశువైద్యుల సూచన



గార్గేయపురంలోని ఓ షెడ్డులో బర్రెలు

**కర్నూలు(రూరల్‌):** వర్షాకాలం వచ్చిందంటే పాడి రైతుల్లో ఆందోళన మొదలవుతుంది. ఇందుకు ప్రధాన కారణం మూగజీవాలకు సోకే వ్యాధులే. అయితే, చిన్న చిన్న జాగ్రత్తలు వాటిని ప్రాణాపాయం నుంచి తప్పిస్తాయి. ఏ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి? వాటిని ఎలా నివారించవచ్చు..? స్థానికంగా లభించే మందులతో వ్యాధులను ఎలా అరికట్టవచ్చు? అనే అంశాలపై పశుపోషకులకు అవగాహన కూడా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు

**ప్రబలే వ్యాధులు**

కోడుమూరు నియోజకవర్గంలో కర్నూలు, కోడుమూరు, గూడూరు, సి. బెళగల్‌ మండలాల్లో 20వేలకుపైగా ఆవులు, గేదెలు, ఎద్దు, 30 వేలకు పైగా మేకలు, గొర్రెలు ఉన్నాయి. వర్షాకాలంలో వ్యాధుల నుంచి రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులకు వరి సాగు చేయడానికి వర్షం అవసరమే కానీ పాడి పరిశ్రమతోపాటు వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచే ఎద్దులకు మాత్రం ప్రాణసంకటం లాంటిది. ఈ కాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, చిటుకు వ్యాధులు సోకుతాయి. ఈ వ్యాధులు సోకితే పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గినట్లుగా గమనించాలి.

**టీకాలు తప్పనిసరి**

వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి. కొందరు రైతులు పాడి దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయించడం ద్వారా పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఓ అపోహ మాత్రమేనంటున్నారు వైద్యులు. వ్యాధులు ముదిరి పశువులు మృతి చెంది నష్టపోవడం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని గార్గేయపురం పశువైద్యాధికారి ఎం.రాజశేఖర్‌ చెబుతున్నారు.

**గొంతు వాపు వ్యాధి**

ఈ కాలంలో పశువులకు ప్రధానంగా గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీన్నే గురకవ్యాధి అని కూడా అంటారు. గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. అలాగే గొర్రెలు, మేకలు, పందులకు కూడా సోకుతుంది. ఇది అంటువ్యాధి, కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. వ్యాధి సోకిన వాటికి జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతుకు వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఉంటుంది.

**నివారణ చర్యలు..**

ఈ వ్యాధి నివారణకు జూన్‌, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకిన పశువుల దొడ్డిని ఫినాయిల్‌, క్రిసాల్‌ వంటి క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. తప్పనిసరిగా పశువైద్యాధికారిని సంప్రదించాలి.

**గాలికుంటు వ్యాధి..**

వాతావరణ మార్పులతో కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో ఆవులు, గేదెలకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి గిట్టలు ఉన్న ప్రతి జీవికి సోకుతుంది. పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి.

**నివారణ మార్గాలు..**

వ్యాధి సోకిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. నోటిలో ఉన్న పుండ్లకు బోరిక్‌ పౌడర్‌, గ్లిసరిన్‌ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి ఈగలు వాలకుండా వేప నూనె రాయాలి. యాంటిబయాటిక్స్‌ వాడితే ఉపశమనం కలుగుతుంది.

**జబ్బ వాపు వ్యాధి..**

ఈ వ్యాధి క్రిలాస్టిడియం చావై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఇది పశువులు, గొర్రెలు, మేకలకు హాని కలిగించే తీవ్రమైన అంటు వ్యాధి. తెల్ల పశువుల్లో ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు వయస్సున్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. ఈ వయస్సులో పశువులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించి వ్యాధి సంభవిస్తుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. ఈ వ్యాధి నివారణకు వ్యాక్సిన్‌ ఒక్కటే సరైన మార్గమని పశువైద్యులు చెబుతున్నారు.

**వర్షాకాలంలో వరి గడ్డి మేలు**



వర్షాకాలంలో పచ్చిమేతకు మట్టి, బురద తగిలి ఉంటుంది. దీనికి తోడు ఒక రకమైన వాసన వస్తుంటుంది కనుక పశువులు ఇష్టంగా తినవు. ఈ కాలంలో పశువులకు వరిగడ్డి బాగా ఉపయోగకరంగా ఉంటుంది. వరిగడ్డి తినే పశువులకు శరీర ఉష్ణోగ్రత పెరిగి కడుపు నిండిన సంతృప్తిని పొందుతాయి. ఇక వైరస్‌లు క్రిమి కీటకాలు పెరగకుండ పశువుల షెడ్లను, పశువులు సంచరించే ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఏమాత్రం వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– ఎం.రాజశేఖర్‌, పశువైద్యాధికారి, గార్గేయపురం

### హాస్టల్‌ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌ విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

**కోడుమూరు రూరల్‌:** సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్‌ మండల కార్యదర్శి అల్తాఫ్‌ బాషా డిమాండ్‌ చేశారు. ఆదివారం మండలంలోని అమడగుంట్ల బీసీ వసతి గృహాన్ని ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు సందర్శించి సమస్యలపై విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా అల్తాఫ్‌ బాషా మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకునే స్థోమత లేక ప్రభుత్వ హాస్టళ్లలో వదులుతున్నారన్నారు. అయితే, పాలకులు హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు వీరాంజనేయులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పీజీఆర్‌ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

**సి.బెళగల్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని తహసీల్దార్‌ వెంకటలక్ష్మి అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రతి సోమవారం పీజీఆర్‌ఎస్‌ నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.